సాక్షి వికారాబాద్

బుధవారం। 29। నవంబర్। 2023



బీఆర్ఎస్‌తోనే సంక్షేమం

బీఆర్ఎస్‌తోనే సంక్షేమం, అభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ పరిగి అసెంబ్లీ అభ్యర్థి కొప్పుల మహేశ్‌రెడ్డి అన్నారు. 6లో▸



ఎలక్షన్.. టెన్షన్

సాధారణ ఎన్నికల ప్రచారం మంగళవారంతో ముగియడంతో పోలింగ్‌కు కౌంట్‌డౌన్ మొదలైంది. 6లో▸



కాంగ్రెస్‌తోనే న్యాయం

కాంగ్రెస్‌తోనే పేదలకు న్యాయం చేకూరుతుందని డీసీసీ అధ్యక్షుడు, పార్టీ పరిగి అభ్యర్థి రామ్మోహన్‌రెడ్డి అన్నారు. 6లో▸

న్యూస్‌రీల్

చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవద్దు

ఎస్పీ కోటిరెడ్డి



వికారాబాద్: చట్టాన్ని ఎవరూ చేతుల్లోకి తీసుకోరాదని, అలాంటి చర్యలను ఎట్టి పరిస్థితుల్లో సహించేది లేదని ఎస్పీ కోటిరెడ్డి అన్నారు. ఎన్నికల బందోబస్తుపై ఆయన మంగళవారం 'సాక్షి'తో మాట్లాడారు. జిల్లాలో ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. వెయ్యి మంది సిబ్బంది ఉండగా బయట నుంచి మరో వెయ్యి మంది పోలీసులను రప్పించాం. ఆరు కంపెనీల కేంద్ర బలగాలు కూడా వచ్చాయి.. జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల్లో 1,133 పోలింగ్ కేంద్రాలు ఉండగా వీటి పరిధిలో 2,500 మందితో ఎన్నికల బందోబస్తు నిర్వహిస్తున్నాం. పోలింగ్‌కు మరికొద్ది గంటల సమయమే ఉండటంతో నిఘాను మరింత పెంచాం. మద్యం, డబ్బు పంపిణీ చేస్తున్నట్లు సమాచారం ఉంటే సీ-విజిల్ యాప్ లేదా నేరుగా మా దృష్టికి తీసుకురావాలి. 50 తనిఖీ బృందాలు పని చేస్తున్నాయి. ఎవరికి వారు తనిఖీలు చేసి చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవద్దు. పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుంది. ప్రజలు, నేతలు గుంపులుగా ఉండరాదు.

కేసు నమోదు చేశాం

సోమవారం రాత్రి వికారాబాద్ పట్టణంలోని బీఆర్ఎస్ కార్యాలయంపై దాడికి యత్నించిన ఘటనకు సంబంధించి కేసులు నమోదు చేశారు. రాత్రి 8గంటల ప్రాంతంలో ఎమ్మెల్యే ఆనంద్, పార్టీ నాయకులు, కార్యకర్తలు కార్యాలయంలో ఉన్నారు. ఆ సమయంలో కొందరు కాంగ్రెస్ నాయకులు కార్యాలయంలోకి చొచ్చుకెళ్లారు. ఈ క్రమంలో ఘర్షణ చోటుచేసుకుంది. ఎమ్మెల్యే గన్‌మెన్‌పై దాడికి యత్నించారు. సమాచారం అందుకున్న తాము ఘటన స్థలానికి చేరుకొని పరిస్థితిని అదుపులోకి తెచ్చాం. బీఆర్ఎస్ నాయకుల ఫిర్యాదు మేరకు కేసులు నమోదు చేశాం.

వాహన తనిఖీల్లో రూ.7.21 లక్షలు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న నగదును చూపుతున్న సీఐ అంజనేయులు, ఎస్ఐ శ్రీధర్‌రెడ్డి

మర్పల్లి: మండలంలోని కల్‌ఖోడ గ్రామం వద్ద మంగళవారం పోలీసులు నిర్వహించిన వాహన తనిఖీల్లో రూ. 7.21 లక్షలు పట్టుబడింది. మర్పల్లి ఎస్ఐ శ్రీధర్‌రెడ్డి కథనం మేరకు.. హైదరాబాద్‌కు చెందిన రమేష్, వికారాబాద్‌కు చెందిన అమీర్ కారులో మర్పల్లి వైపు వస్తున్నారు. కల్‌ఖోడ గ్రామం వద్ద సీఐ అంజనేయులు ఆధ్వర్యంలో సిబ్బంది కారును తనిఖీ చేశారు. వాహనంలో రూ. 7.21 లక్షలు నగదు ఉండడం, సరైన పత్రాలు లేకపోవడంతో సీజ్ చేశారు. పొంతనలేని సమాధానం చెప్పడంతో కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. అయితే అధికార పార్టీ నాయకుడికి చెందిన డబ్బుగా తెలిసింది.

ప్రచారం పరిసమాప్తం

అమలులోకి సైలెంట్ పీరియడ్

- ప్రలోభాలతో ఎర
- మద్యం, డబ్బు పంపిణీపై నేతల దృష్టి
- ఓటరు స్లిప్పుల పేరిట ఇళ్లకు వెళుతున్న నాయకులు
- పోటాపోటీగా నగదు వితరణకు రంగం సిద్ధం



వికారాబాద్: ఎన్నికల సమరం తుది అంకానికి చేరుకుంది. రెండు నెలలుగా హోరెత్తిన ప్రచారం మంగళవారంతో ముగిసింది. సాయంత్రం 5గంటల నుంచి సైలెంట్ పీరియడ్ అమల్లోకి వచ్చింది. ప్రధానంగా పోటీ బీఆర్ఎస్, కాంగ్రెస్ మధ్యే ఉంది. కొన్ని చోట్ల బీజేపీ, స్వతంత్ర అభ్యర్థులు గెలుపోటములపై ప్రభావం చూపనున్నారు. ప్రచారం ముగియడంతో గెలుపే ప్రధానంగా పార్టీలు ఓటర్లను ప్రలోభానికి గురి చేసేందుకు సిద్ధమవుతున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో పోలీసులు అప్రమత్తమయ్యారు. జిల్లా వ్యాప్తంగా అంతర్రాష్ట్ర, అంతర్ జిల్లా చెక్‌పోస్టుల వద్ద తనిఖీలను ముమ్మరం చేశారు.

ప్రలోభాలకు రంగం సిద్ధం

ఎన్నికల్లో ఎలాగైనా గెలవాలని భావిస్తున్న ప్రధాన పార్టీలు చివరి క్షణాల్లో ఓటర్లను ప్రలోభాలకు గురిచేసే అవకాశాలపై దృష్టి పెట్టారు. మంగళవారం సాయంత్రం 5గంటల నుంచి మద్యం దుకాణాలు బంద్ కావడంతో ముందుగానే మద్యం కొనుగోలు చేసి గ్రామాలకు తరలించినట్లు సమాచారం. కొన్ని చోట్ల 20రోజులు క్రితమే మద్యం కొనుగోలు చేసి సురక్షిత ప్రాంతాల్లో డంప్ చేసినట్టు తెలుస్తోంది. ఓటర్ల స్థాయిని బట్టి మద్యం బ్రాండ్లు సిద్ధం చేసుకున్నట్లు సమాచారం. అంతేకాకుండా తమకు పట్టులేని చోట్ల డబ్బు ఎరవేసేందుకు కూడా ప్రయత్నాలు ముమ్మరం చేసినట్లు తెలిసింది. ఓటుకు రూ.500 నుంచి రూ. 2000 వరకు కూడా ఇచ్చే అవకాశం లేకపోలేదని పలువురు పేర్కొంటున్నారు. డబ్బు, మద్యం పంపిణీపై అధికార, ప్రతిపక్ష పార్టీలు దృష్టి సారించాయి. పోలీసులు కూడా నిఘాను పెంచారు. ఈ నెల 30న పోలింగ్ ఉండడంతో ఒకరోజు ముందుగానే ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు ఎవరి ప్రయత్నాలు వారు చేస్తున్నారు. రాజకీయ పార్టీల నాయకులు ఓటరు స్లిప్పులు పంచరాదు. అయితే నాయకులు ఇళ్లకు వెళ్లి స్లిప్పులు పంచుతున్నారు. ఈ క్రమంలోనే డబ్బు, మద్యం ఇస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

తస్మాత్ జాగ్రత్త

ఓటు వజ్రాయుధంతో సమానం. మన ఐదేళ్ల భవిష్యత్తుకు పునాది. విజ్ఞతతో ఆలోచించి సేవ చేసే వారికే ఓటు వేయాలని మేధావులు సూచిస్తున్నారు. ప్రలోభాలకు లొంగకుండా ఓటు వేయాలని అధికారులు సూచిస్తున్నారు. గురువారం ఉదయం 7నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ జరగనుంది. ఇందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.



రోడ్‌షోలో మాట్లాడుతున్న మంత్రి హరీశ్‌రావు చిత్రంలో అభ్యర్థి నరేందర్‌రెడ్డి, మంత్రి మహేందర్‌రెడ్డి

పీఎన్ఆర్‌తోనే కొడంగల్ ఆత్మగౌరవం

- రేవంత్‌కు దమ్ముంటే కొడంగల్‌లో గెలవాలి
- ఆయనకు రెండు చోట్లా ఓటమి తప్పదు
- ఆర్థిక శాఖ మంత్రి హరీశ్‌రావు

కొడంగల్: పట్నం నరేందర్‌రెడ్డితోనే కొడంగల్ ఆత్మ గౌరవం నిలబడుతుందని ఆర్థిక శాఖ మంత్రి హరీశ్‌రావు అన్నారు. మంగళవారం నియోజకవర్గంలోని మద్దూరులో నిర్వహించిన రోడ్ షోలో ఆయన మాట్లాడారు. రేవంత్‌రెడ్డి కొడంగల్, కామారెడ్డి రెండింటిలోనూ ఓడిపోతారని అన్నారు. రేవంత్ గెలిచేది లేదు వచ్చేది లేదన్నారు. నిత్యం ప్రజల మధ్యన ఉంటూ సేవ చేసే నరేందర్‌రెడ్డిని 50 వేల మెజారిటీతో గెలిపించాలన్నారు. నరేందర్‌రెడ్డి మనసున్న వ్యక్తి, అందరివాడని కొనియాడారు. ఆయనను గెలిపిస్తే ప్రమోషన్ వస్తుందని చెప్పారు. రేవంత్‌రెడ్డి కొడంగల్‌లో నామినేషన్ వేసిన తర్వాత నాలుగు సార్లు కూడా రాలేదన్నారు. సావుకొచ్చాడా, లగ్గానికి వచ్చాడా, గుడికి వచ్చాడా, మసీద్‌కు వచ్చాడా అని ప్రశ్నించారు. కర్ణాటక రాష్ట్రంలో ఐదు గ్యారంటీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ అక్కడ వాటిని అమలు చేయడం లేదని విమర్శించారు. 3 గంటల కరెంటు కావాలా 24 గంటల కరెంటు కావాలా మీరే నిర్ణయించుకోవాలని అన్నారు. కాంగ్రెస్ వస్తే రైతు బంధు రద్దు అవుతుందన్నారు. ముచ్చటగా మూడోసారి కేసీఆర్ ముఖ్యమంత్రి కావడం ఖాయమన్నారు. రెండో సారి నరేందర్‌రెడ్డి గెలిస్తే కొడంగల్‌ను ఆదర్శంగా తీర్చిదిద్దుతారని పేర్కొన్నారు. కేసీఆర్ ప్రభుత్వం సంక్షేమ పథకాలు ప్రారంభించి ప్రజలను కడుపులో పెట్టుకొని చూసుకుంటోందని తెలిపారు. సౌభాగ్యలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ప్రతి నెలా రూ.3వేలు ఇస్తామన్నారు. ఆసరా పింఛన్ మొత్తాన్ని రూ. 5వేలకు, రైతు బంధు మొత్తాన్ని రూ.16వేలకు, ఆరోగ్య శ్రీ పథకాన్ని రూ.15లక్షలకు పెంచుతామన్నారు. అన్ని వర్గాల సంక్షేమం కోసం కేసీఆర్ కష్టపడుతున్నారని పేర్కొన్నారు. నవంబర్ 30న జరిగే ఎన్నికలు ఆషామాషీ కాదన్నారు. తెలంగాణ ప్రజల ఆత్మగౌరవానికి సంబంధించిన ఎన్నికలన్నారు. రెండు సార్లు కొడంగల్‌లో ఎమ్మెల్యేగా గెలిచిన రేవంత్‌రెడ్డి ప్రజలను పట్టించుకోలేదన్నారు. మద్దూరు మండల కేంద్రాన్ని మున్సిపల్‌గా మారుస్తామన్నారు. దౌల్తాబాద్ మండలం చంద్రకల్ దగ్గర పరిశ్రమ ఏర్పాటు చేస్తామన్నారు. అనంతరం మంత్రి మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. పట్నం నరేందర్‌రెడ్డిని గెలిపించాలన్నారు. బీఆర్ఎస్ అభ్యర్థి నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. రేవంత్‌కు దమ్ముంటే తనపై గెలవాలని సవాల్ విసిరారు.

పోలింగ్‌కు సర్వం సిద్ధం

- సిబ్బందికి కేంద్రాల కేటాయింపు
- నేడు ఎన్నికల సామగ్రి పంపిణీ
- కలెక్టర్ నారాయణరెడ్డి

వికారాబాద్ అర్బన్: ఎన్నికలకు సర్వం సిద్ధం చేసినట్లు కలెక్టర్ సీ నారాయణరెడ్డి తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో సాధారణ ఎన్నికల పరిశీలకులు ఆకాష్, సుధాకర్ సమక్షంలో పీఓ, ఏపీఓ, మైక్రో అబ్జర్వర్లకు మూడో విడత ర్యాండమైజేషన్ కార్యక్రమాన్ని నిర్వహించి పోలింగ్ కేంద్రాలను కేటాయించారు. అనంతరం పట్టణంలోని మేరీ నాట్స్ పాఠశాలలో ఎన్నికల సామగ్రి పంపిణీ ఏర్పాట్లను పరిశీలించారు.

విద్యాసంస్థలకు సెలవు

అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో పోలింగ్‌కు ముందు రోజు, పోలింగ్ రోజు(29, 30 తేదీల్లో) ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు, విద్యాసంస్థలకు సెలవులు ప్రకటించినట్లు కలెక్టర్ తెలిపారు. జిల్లాలోని ఓటర్లు విధిగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. ఎన్నికల విధులు నిర్వహించే ప్రభుత్వ ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. సకాలంలో విధులకు హాజరు కాకపోయినా, గైర్హాజరైనా చర్యలు తప్పవని హెచ్చరించారు.



ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి, అబ్జర్వర్లు

కాంగ్రెస్‌కు ఓటేసి ఆగం కావొద్దు



ప్రచారంలో డోలు కొడుతున్న రోహిత్‌రెడ్డి

- వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమే
- తాండూరు అభ్యర్థి రోహిత్‌రెడ్డి

పెద్దేముల్: ''నేను చనిపోతే బొందపెట్టేది తాండూరులోనే.. నేను మీ బిడ్డను ఆశీర్వదించండి.. రాష్ట్రంలో వచ్చేది కేసీఆర్ ప్రభుత్వమే.. కాంగ్రెస్‌కు ఓటేసి ఆగం కావొద్దు'' అని బీఆర్ఎస్ తాండూరు అభ్యర్థి, ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి అన్నారు. మంగళవారం పెద్దేముల్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 60 ఏళ్లలో సాధ్యం కాని అభివృద్ధి నాలుగేళ్ల తన హయాంలో జరిగిందన్నారు. రూ.1,680 తెచ్చి ఈ ప్రాంతాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసినట్లు తెలిపారు. కాంగ్రెస్‌కు ఓటు వేస్తే కర్ణాటక రాష్ట్ర ప్రజలకు పట్టిన గతే పడుతుందన్నారు. తాండూరు నియోజకవర్గంలో ఎన్ని గ్రామాలు ఉన్నాయో తెలియని వ్యక్తి ఓటు వేసి ఆగం కావద్దని అన్నారు. మళ్లీ కేసీఆర్ ప్రభుత్వం రాబోతుందన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రం ఎంతో పురోగతి సాధించిందన్నారు. దేశంలో ఎక్కడా అమలు కాని పథకాలు తెలంగాణలో అమలవుతున్నట్లు తెలిపారు. ప్రజలు కేసీఆర్ వెంటే ఉన్నారని పేర్కొన్నారు. నేడు రాష్ట్రం సంక్షేమానికి మారుపేరుగా మారిందన్నారు. కాంగ్రెస్ హయాంలో రైతులు చనిపోతే అడిగే నాథులే లేరని తెలిపారు. రెండోసారి తనను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ నర్సింలు, మాజీ సర్పంచ్ కిషన్‌రావు, నాయకులు నరేష్‌రెడ్డి, శిబ్లీ, మెరాజ్, విఠల్, నర్సింలు, ఆసంకాన్ తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్‌ను గద్దె దించాల్సిందే



తాండూరు: నిరుద్యోగ యువ గర్జనలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ కోదండరామ్

- ఆయనొక్కరే ఉద్యమం చేయలేదు
- ప్రతిఒక్కరి పోరాటంతోనే ప్రత్యేక రాష్ట్ర కల సాకారమైంది
- టీజేఎస్ అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరామ్

తాండూరు/బొంరాస్‌పేట: కేసీఆర్ కుటుంబ పాలనను గద్దె దించాల్సిన సమయం ఆసన్నమైందని టీజేఎస్ అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరామ్ అన్నారు. మంగళవారం తాండూరు ఎస్వీఆర్ గార్డెన్‌లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన నిరుద్యోగ యువ గర్జన సభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. ఆత్మబలిదానాలు, ప్రజల ఉమ్మడి పోరాట ఫలితంగానే ప్రత్యేక తెలంగాణ ఆకాంక్ష నెరవేరిందన్నారు. రాష్ట్రాన్ని కుటుంబ జాగీరుగా మార్చుకొని కేసీఆర్ నియంతృత్వ పాలన సాగిస్తున్నారని విమర్శించారు. కాళేశ్వరం, పాలమూరు ఎత్తిపోతల ప్రాజెక్టుల నిర్మాణంలో భారీగా అవినీతి జరిగిందని ఆరోపించారు. ఆ డబ్బే ఎన్నికల్లో ఖర్చు చేస్తున్నారని ధ్వజమెత్తారు. జాబ్ క్యాలెండర్ మాట అటుంచితే పరీక్ష పేపర్ల లీకేజీలు నిరుద్యోగులను తీవ్ర ఆవేదనకు గురి చేశాయని పేర్కొన్నారు. కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణలో ఇలాంటి ప్రభుత్వం ఉండటం ప్రమాదకరమన్నారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ తాండూరు అభ్యర్థి మనోహర్‌రెడ్డి మాట్లాడారు. ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి తాండూరు ప్రజలను మోసం చేశారని ఆరోపించారు. ఆయనకు బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. రాష్ట్రంలో ప్రజాస్వామ్యం తిరిగి రావాలంటే బీఆర్ఎస్‌ను గద్దె దించాలన్నారు. కాంగ్రెస్‌తోనే పేదలకు మేలు జరుగుతుందన్నారు. తనను భారీ మెజారిటీ గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమ కారుడు విఠల్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మురళీకృష్ణ గౌడ్, కౌన్సిలర్ సోమశేఖర్, జేఏసీ నాయకులు రామకృష్ణ పాల్గొన్నారు.

అమ్మానాన్నలను ఒప్పించాలి

బొంరాస్‌పేట: యువకులు, నిరుద్యోగులు అమ్మానాన్నలను ఒప్పించి కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయించాలని కోదండరామ్ పిలుపునిచ్చారు. బొంరాస్‌పేట మండలం తుంకిమెట్లలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పోరాడి తెచ్చుకున్న తెలంగాణ కేసీఆర్ కుటుంబం పాలైందని ఆరోపించారు. కేసీఆర్‌కు సొంత ఆస్తుల మీద ఉన్న ప్రేమ పేదల సంక్షేమం మీద లేదన్నారు. తప్పును ప్రశ్నించే వారిపై తప్పుడు కేసులు మోపుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే గెలుపొందడంతో కొడంగల్ నష్టపోయిందన్నారు. పాలమూరు ఎత్తిపోతల ప్రాజెక్టుతో ఉమ్మడి జిల్లా సస్యశ్యామలం అవుతుందని అన్నారు. కాంగ్రెస్ మేనిఫెస్టో బాగుందన్నారు. ధరణి రాక ముందు 30 వేల భూ సమస్యలు ఉంటే ఇప్పుడు 20లక్షల కేసులు పెరిగాయని వివరించారు.

క్లుప్తంగా

నాగసమందర్‌లో డబ్బుల పంపిణీ కలకలం

ధారూరు: బీఆర్ఎస్ తరఫున డబ్బులు పంచేందుకు వచ్చారనే అనుమానంతో నలుగురు యువకులను కాంగ్రెస్ నాయకులు, స్థానికులు పట్టుకున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి.. నాగసమందర్‌లో బీఆర్ఎస్ తరఫున డబ్బులు పంచడానికి హైదరాబాద్ నుంచి కొత్త వ్యక్తులు వచ్చారనే సమాచారం అందుకున్న కాంగ్రెస్ కార్యకర్తలు, స్థానికులు మంగళవారం రాత్రి వీరిని అనుసరించారు. బీఆర్ఎస్ నాయకులు ఓటర్లకు డబ్బులు పంచుతుండగా యువకులు పేర్లు రాసుకుంటున్నారని హస్తం పార్టీ నాయకులు తెలిపారు. వీరిని నిలదీయగా తమది హైదరాబాద్ అని, బీఆర్ఎస్ నాయకుల వెంట వచ్చామని చెప్పారన్నారు. సమాచారం అందుకున్న ఎస్ఐ సంతోష్‌కుమార్, సిబ్బంది అక్కడి వెళ్లి అందరిని చెదరగొట్టారు.

సంక్షేమానికి 'కారు'కే ఓటేయండి

బీఆర్ఎస్ చేవెళ్ల అభ్యర్థి కాలె యాదయ్య



మొయినాబాద్: చిన్నషాపూర్‌లో నమునా ఈవీఎంతో కాలె యాదయ్య ప్రచారం

మొయినాబాద్: ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలు కొనసాగాలంటే కారుగుర్తుకు ఓటేయాలని బీఆర్ఎస్ చేవెళ్ల అభ్యర్థి కాలె యాదయ్య కోరారు. మంగళవారం ఆయన మండల పరిధిలోని అమీర్‌గూడ, చిన్నషాపూర్ గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వ పథకాలు ప్రతీ ఇంటికి అందాయని.. పథకాలన్నీ కొనసాగలంటే మరోసారి తనను ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. ఈ ప్రచారంలో పార్టీ రాష్ట్ర నాయకుడు అనంతరెడ్డి, సీనియర్ నాయకుడు నర్సింహారెడ్డి, పీఏసీఎస్ మాజీ చైర్మన్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎంపీటీసీ మాజీ సభ్యుడు మాణిక్‌రెడ్డి, నాయకులు జయవంత్, కృష్ణారెడ్డి, రవియాదవ్, ప్రవీణ్, సత్తిరెడ్డి, నర్సింహారెడ్డి, నాగరాజు, సురేందర్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

మరోసారి ఆశీర్వదించండి

మొయినాబాద్‌రూరల్: కారు గుర్తుకు ఓటేసి తనను మరో సారి ఆశీర్వదించాలని బీఆర్ఎస్ చేవెళ్ల అభ్యర్థి కాలె యాదయ్య అన్నారు. మంగళవారం ఆయన మండల పరిధిలోని అజీజ్‌నగర్‌లో పార్టీ గ్రామ అధ్యక్షుడు మల్లారెడ్డి ఆధ్వర్యంలో భారీ ఎత్తున ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పదేళ్ల అభివృద్ధిని చూసి మరోమారు బీఆర్ఎస్‌కు పట్టం కట్టాలని కోరారు. అధికారంలోకి వచ్చిన వెంటనే అజీజ్‌నగర్‌లో డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల స్థలాలు అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు అనంతరెడ్డి, జిల్లా నాయకులు మాణిక్‌రెడ్డి, సర్పంచ్ సంధ్య, నాయకులు మల్లారెడ్డి, నర్సింహారెడ్డి, సత్తయ్య, నర్సింహాచారి, రవియాదవ్, జగన్‌మోహన్‌రెడ్డి, నర్సింహగౌడ్, మాణిక్, డేవిడ్, పోచయ్య పాల్గొన్నారు.

30న వేతనంతో కూడిన సెలవు

ఇబ్రహీంపట్నం రూరల్: పోలింగ్ సందర్భంగా ఈ నెల 30న ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు వీలుగా ప్రభుత్వం వేతనంతో కూడిన సెలవుదినంగా ప్రకటించిందని రంగారెడ్డి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ భారతిహోళికేరి తెలిపారు. గురువారం అన్ని ప్రభుత్వ, ప్రభుత్వేతర సంస్థలకు పరిశ్రమలకు వేతనంతో కూడిన సెలవు దినంగా ప్రకటించారని చెప్పారు.

'కొడంగల్' సింహం ఎవరో?

- ఇప్పటికే నిర్ణయానికి వచ్చిన ఓటర్లు
- మార్పు అనివార్యమేనా..?
- ప్రమోషన్ ప్రకటనతో పీఎన్ఆర్‌కు తలనొప్పులు




రేవంత్ రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు





నరేందర్ రెడ్డి, ఎమ్మెల్యే



కొడంగల్: నియోజకవర్గ ప్రజల తీర్పు విభిన్నం. మార్పు కావాలనుకుంటే ఎలాంటి వారికైనా పరాభవం తప్పదు. ఇది గతంలో నిరూపితమైంది. 1983లో ఎన్టీఆర్ ప్రభంజనంలోనూ ఇక్కడ కాంగ్రెస్ గెలిచింది. 2014లో తెలంగాణ ఉద్యమాన్ని పక్కకు పెట్టి టీడీపీకి అవకాశం ఇచ్చారు. ఈ దఫా అసెంబ్లీ ఎన్నికల్లో ఓటర్ల నాడీ నాయకులకు అంతు పట్టడం లేదు. ఓటరును ప్రసన్నం చేసేందుకు అభ్యర్థులు, వారి అనుచరులు శక్తి వంచన లేకుండా పనిచేస్తున్నారు. అయితే కొడంగల్‌లో ఎవరు గెలిచినా ఈ ప్రాంతానికి ప్రాధాన్యత లభించే అవకాశం ఉంది. అందులో ఒకరు రేవంత్‌రెడ్డి. ఆయన పీసీసీ అధ్యక్షుడి హోదాలో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్నారు. ఇక్కడ ఆయన విజయం ఖరారైతే రాజకీయంగా మరింత పట్టు సాధిస్తాడనడంలో ఎలాటి సంశయం లేదు. కాంగ్రెస్ పార్టీ 60 స్థానాలకుపైగా గెలిస్తే రేవంత్ సీఎం అవుతాడని ఆయన అభిమానులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఈ పరిణామం కొడంగల్ ప్రజల తలరాత మారుస్తుందని హస్తం నేతలు అంటున్నారు. బీఆర్ఎస్ అభ్యర్థి పట్నం నరేందర్‌రెడ్డి గెలిస్తే మంత్రి పదవి లభిస్తుంది. ఈ విషయాన్ని బీఆర్ఎస్ అధినేతలు కేసీఆర్, కేటీఆర్, హరీష్‌రావులు ఇప్పటికే ప్రకటించారు. బీఆర్ఎస్ గెలిస్తే మంత్రి పదవి, కాంగ్రెస్ గెలిస్తే ముఖ్యమంత్రి పదవి కొడంగల్‌కు వరిస్తుందని జనం భావిస్తున్నారు. ఇద్దరిలో ఎవరిని గెలిపించాలనే విషయంపై ఓటర్లు ఇప్పటికే ఒక నిర్ణయానికి వచ్చినట్లు పలు సర్వేల్లో బహిర్గతమవుతోంది. ఈనెల 30న సాయంత్రం 5 గంటల తర్వాత వెలువడే ఎగ్జిట్‌పోల్‌లో ఈ విషయం బయట పడుతుందని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు.

ఓటమి కోసం శ్రమిస్తున్న నేతలు..?

నరేందర్‌రెడ్డిని గెలిపిస్తే ప్రమోషన్ వస్తుందని బీఆర్ఎస్ అధినేతలు ఏ క్షణంలో ప్రకటించారో కాని అప్పటి నుంచి ఆయనకు ఇబ్బందులు తలెత్తాయి. ప్రజల మనిషిగా పేరుగాంచిన ఆయనకు నియోజకవర్గంలో పెద్ద సంఖ్యలో అభిమానులు ఉన్నారు. ఆయన కోసం గట్టిగా పనిచేసే కార్యకర్తలు ఉన్నారు. ఆయన నామినేషన్ వేస్తే అలవోకగా గెలిచేంతగా పట్టు సాధించారు. అయితే ప్రమోషన్ ఇస్తామని బహిరంగంగా చెప్పడంతో బీఆర్ఎస్ జిల్లా నేతలే ఆయన ఓటమి కోసం శ్రమిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఆయన గెలిస్తే తమకు రాజకీయంగా ప్రాధాన్యత తగ్గుతుందని భావిస్తున్నట్లు సమాచారం. దీంతో ఆయన ఓడితేనే తమకు రాజకీయ భవిష్యత్ ఉంటుందని జిల్లా నేతలు భావిస్తున్నట్లు పీఎన్ఆర్ అభిమానులు ఆందోళన చెందుతున్నారు.

గురునాథ్‌రెడ్డి కేడర్ రేవంత్‌కే జై

కొడంగల్‌లో మాజీ ఎమ్మెల్యే గురునాథ్‌రెడ్డి కీలకంగా మారారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఆయన టీఆర్ఎస్ పక్షాన ప్రచారం చేసి నరేందర్‌రెడ్డిని అసెంబ్లీ మెట్లెక్కించారు. గురునాథ్‌రెడ్డికి బీఆర్ఎస్‌లో సముచిత స్థానం దక్కకపోవడంతో ఆయన కారు దిగి కాంగ్రెస్‌కు మద్దతిచ్చారు. గురునాథ్‌రెడ్డితో పాటుగా ఆయన కుటుంబ సభ్యులు ఎంపీపీ ముద్దప్ప దేశ్‌ముఖ్, కొడంగల్ మున్సిపల్ చైర్మన్ జగదీశ్వర్‌రెడ్డిలతో పాటు నియోజకవర్గంలోని ఆయన కేడర్ మొత్తం రేవంత్ పక్షాన నిలిచింది. హస్తం విజయం కోసం గట్టిగా పని చేస్తున్నారు. నియోజకవర్గంలో ఉన్న తన అనుచరులను కాంగ్రెస్‌లో చేర్పించారు. ఇప్పటికే బీఆర్ఎస్‌కు ఇబ్బందికర వాతావరణం కల్పించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ కొడంగల్‌లో బీఆర్ఎస్‌ను ఓడించాలనే నిర్ణయానికి వచ్చారు. నవంబర్ 30న జరిగే అసెంబ్లీ ఎన్నికలు ఎవరి తలరాతను మారుస్తుందోనని స్థానికులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

సర్వత్రా ఎలక్షన్.. టెన్షన్

- మంగళవారంతో ముగిసిన ప్రచారం
- రేపే పోలింగ్



పోలీసులు స్వాధీనం చేసుకున్న మద్యం

నవాబుపేట: సాధారణ ఎన్నికల ప్రచారం మంగళవారంతో ముగియడంతో పోలింగ్‌కు కౌంట్‌డౌన్ మొదలైంది. నెల రోజులుగా ప్రధాన పార్టీలకు ముచ్చెమటలు పట్టిస్తున్న ఈ ఎన్నిక ఓటర్లు ఎవరికి మొగ్గుచూపుతారు? ఏపార్టీని ఆదరిస్తారనేది సర్వత్రా ఉత్కంఠ రేకెత్తిస్తుంది. నెల రోజులుగా అన్ని పార్టీల అభ్యర్థులు, నాయకులు ప్రచార సభలు, రోడ్‌షోలు, బైక్‌ర్యాలీలతో ముమ్మరంగా ప్రజల్లోకి దూసుకెళ్లారు. ఓటర్లను ఆకట్టుకునేందుకు ప్రసంగాలు, మాటల యుద్ధం చేశారు.

ఆఖరి అస్త్రం

మైకు ప్రచారానికి తెరపడటంతో ఆయా పార్టీల నాయకులు, అభ్యర్థులు ఓటర్లను ఆకట్టుకునేందుకు ఎత్తగడలు వేస్తున్నారు. నోట్ల కట్టలు, మద్యం బాటిల్లు , మేము గెలిస్తే అది చేస్తా.. ఇది చేస్తాం ఒక్క అవకాశం ఇవ్వండని ప్రాధేయపడుతున్నారు. పోలింగ్‌కు గంటల సమయమయే ఉండడంతో ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు అభ్యర్థులు ఆఖరి అస్త్రాన్ని ప్రయోగిస్తున్నారు. అసెబ్లీ అభ్యర్థి రూ.40 లక్షల వరకే ఖర్చు చేయాలని ఎన్నికల నిబంధనలు ఉన్నప్పటికీ ఒక్కో అభ్యర్థి ఖర్చు రూ.కోట్లలోకి వెళ్లిందని పలువురు చర్చించుకుంటున్నారు. డబ్బు, మద్యం, తదితర సామగ్రి పంపకుండా అధికారులు చర్యలు తీసుకుంటున్నా నాయకులు మాత్రం గుట్టుచప్పుడు కాకుండా ఓటర్లకు చేరవేస్తున్నారు. అందరి వద్ద డబ్బులు, మద్యం తీసుకుంటున్న ఓటర్లు ఓటు ఎవరికి వేసి ఎవరికి వేస్తారో వచ్చే నెల 3వరకు ఆగాల్సిందే.

నీలి జెండాను ఎగరేద్దాం..

- తాండూరు బీఎస్పీ అభ్యర్థి చంద్రశేఖర్‌ను గెలిపిద్దాం
- పార్టీ సెంట్రల్ కోఆర్డినేటర్ రాంజీగౌతమ్



మాట్లాడుతున్న రాంజీగౌతమ్, ప్రజలకు అభివాదం చేస్తున్న చంద్రశేఖర్ ముదిరాజ్

తాండూరు: బహుజన కులాల మద్దతుతో తాండూరు గడ్డపై నీలి జెండాను ఎగురవేసి బీఎస్పీ అభ్యర్థి చంద్రశేఖర్ ముదిరాజ్‌ను అసెంబ్లీకి పంపుదామని పార్టీ సెంట్రల్ కోఆర్డినేటర్ రాంజీగౌతమ్ అన్నారు. మంగళవారం ఆయన పట్టణంలో నిర్వహించిన బహిరంగ సభకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బహుజన రాజ్యాధికారమే లక్ష్యంగా పనిచేయాలన్నారు. అనంతరం చంద్రశేఖర్ మాట్లాడుతూ.. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌కు మద్దతుగా ప్రజలంతా ఏకమవుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ చీఫ్ కోఆర్డినేటర్ ప్రభాకర్ మంద, తాండూరు అసెంబ్లీ కన్వీనర్ దొరిశెట్టి సత్యమూర్తి, నాయకులు ప్రభుకుమార్, అమ్‌జద్ అలీ, అరుణ్‌రాజ్, కార్యకర్తలు తదితరులున్నారు.

ఫార్మాసిటీ రద్దు.. భూములు వాపస్

కాంగ్రెస్ ఇబ్రహీంపట్నం అభ్యర్థి మల్‌రెడ్డి రంగారెడ్డి



మాట్లాడుతున్న మల్‌రెడ్డి రంగారెడ్డి

ఇబ్రహీంపట్నం: తనను అసెంబ్లీకి పంపి.. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఫార్మాసిటీ, మైనింగ్ జోన్ రద్దుతో పాటుగా రైతుల భూములు వాపస్ ఇస్తామని పార్టీ ఇబ్రహీంపట్నం అభ్యర్థి మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. మంగళవారం ఆయన పట్టణంలోని పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఫార్మాసిటీ రద్దును మేనిఫెస్టోలోనే పెట్టామని వివరించారు. రైతులకు ప్రభుత్వం ఇచ్చిన పరిహారం తిరిగి ఇవ్వాల్సిన అవసరం లేదన్నారు. నియోజకవర్గంలోని భూములు తీసుకుని ఏర్పాటు చసిన ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల్లో 25శాతం ఉద్యోగాలు స్థానిక నిరుద్యోగులకే దక్కేలా చర్యలు తీసుకుంటామన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ పథకాల్లోనూ కమీషన్లు తీసుకుని వారి అనుచరులకే అమలు చేశారని ఆరోపించారు. ఆరుగ్యారెంటీల అమలు చేస్తానని ప్రమాణం చేశానని గుర్తు చేశారు. నియోజకవర్గ ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటానన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ స్రవంతి, మాజీ సర్పంచ్ లక్ష్మయ్య, పార్టీ నాయకులు ఈసీ శేఖర్‌గౌడ్, గురునాథ్‌రెడ్డి, పాండురంగా రెడ్డి, సింహారెడ్డి, రమేశ్, డబ్బికార్ శ్రీనివాస్, జగదీశ్‌యాదవ్, శంకర్‌గౌడ్, ఆనంద్, రమేష్‌గౌడ్, గౌస్, పాండు, శ్యాం, సీపీఐ నాయకులు నర్సింహ, టీడీపీ నాయకులు రవీందర్ పాల్గొన్నారు.

రెండు రోజుల ముందు గుర్తుంపు కార్డులు

తుర్కయంజాల్: ఎన్నికలకు రెండు రోజులు గడువుండగా ఓటరు గుర్తింపు కార్డులు వందల సంఖ్యలో పోస్టల్ శాఖ ద్వారా వచ్చిపడ్డాయి. దీంతో అధికారులు వాటిని పంపిణీ చేసేందుకు నానా తిప్పలు పడుతున్నారు. తుర్కయంజాల్ మున్సిపల్ పరిధిలోని ఒక్క ఇంజాపూర్‌లోనే 1,047 కార్డులు రావడంతో వాటిని ఎలా ఓటర్లకు చేరవేయాలో తెలియక తల పట్టుకుంటున్నారు. కాలనీల వారీగా వెతికి పక్కన పెడుతున్నారు. వీలైనంత వరకు పంపిణీ చేస్తామన్నారు.

ప్రలోభాల పర్వం



- ప్రణాళికతో పంపకాలు
- సామాజికవర్గాల వారీగా కలుస్తున్న నేతలు
- ఓటర్లను ఆకర్షించేందుకు పాట్లు

షాబాద్: గెలుపే లక్ష్యంగా అభ్యర్థులు ప్రణాళికలు రూపొందించుకున్నారు. అనుచరగనాన్ని రంగంలోకి దింపి ఓటర్లను ఆకర్షించేందుకు యత్నిస్తున్నారు. సామాజికవర్గాల వారీగా కలుస్తూ హామీలిస్తూ.. గెలుపునకు సహకరించాలని కోరుతున్నారు. కుల పెద్దలతో రహస్యంగా మంతనాలు జరుపుతున్నారు. అన్ని సామాజిక వర్గాల మద్దతుంటే విజయం నల్లేరు మీద నడకలా ఉంటుందని భావిస్తున్నారు. కుల సంఘాల వారీగా ఓటర్లను గుర్తించేందుకు ప్రత్యేకంగా టీంలను ఏర్పాటు చేసుకున్నారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాలకు వెళ్లి ఓట్లు అడిగే సమయం లేకపోవడంతో ప్రధాన గ్రామాలపై దృష్టి సారించారు.

కుల పెద్దలతో సంప్రదింపులు

ప్రధాన పార్టీలకు చెందిన అభ్యర్థులు కులాలు, మతాల వారీగా ఓటర్లను గుర్తించి ఆయా వర్గాలకు చెందిన పెద్దలతో సంప్రదింపులు చేస్తున్నారు. సమయం దొరికినప్పుడల్లా ఫోన్లలో వారిని ఆప్యాయంగా పలుకరిస్తూ విజయానికి సహకరించాలని కోరుతున్నారు. ఇదే సమయంలో స్థానిక సమస్యలు, భవిష్యత్‌లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులను ప్రస్తావించి.. గెలిచిన వెంటనే పరిష్కరిస్తామని హామీలిస్తున్నారు. జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల్లో ఎక్కువ ఓట్లు కలిగి ఉన్న సామాజికవర్గాన్ని గుర్తించి వారి మద్దతునుకూడగట్టుకుంటున్నారు. 40 నుంచి 45 శాతం ఓటర్ల మద్దతును కూడగడితే విజయం తథ్యమనే ధీమాలో అభ్యర్థులున్నారు.

రెండు వైపులా వారే...

పోటీలో ఉన్న అభ్యర్థులు ఎవరిని నమ్మాలో? ఎవరిని దూరంగా ఉంచాలో అర్థం కాక తల పట్టుకుంటున్నారు. దీనికి కారణం లేకపోలేదు. ఎందుకంటే ఉదయం ఓ అభ్యర్థి ప్రచారంలో కనిపిస్తున్న వ్యక్తులు చీకటి కాగానే మరో అభ్యర్థి శిబిరంలో ప్రత్యక్షమవుతున్నారు. తమకే ఓట్లు వేయిస్తామని హామీలిస్తూ.. మందు, విందు పార్టీల్లో మునిగి తేలుతున్నారు. ఒక్కరుగా వెళ్లకుండా కొంత మందిని పోగేసుకొని మరీ వెళ్తున్నారు. మరికొందరు ఇప్పటికే ఫిరాయింపులకు పాల్పడిన వారి పక్షం వైపు చక్రం తిప్పుతుండడంతో అభ్యర్థులు గందరగోళంలో పడ్డారు.

బీఆర్ఎస్‌తో ప్రజా సంక్షేమం

పార్టీ పరిగి అభ్యర్థి మహేశ్‌రెడ్డి



పరిగి: ప్రజలకు వందనం చేస్తున్న మహేశ్‌రెడ్డి

పరిగి: ప్రజా సంక్షేమం బీఆర్ఎస్‌తోనే జరిగిందని.. పేదల సంక్షేమం కోసం మరోసారి కారు గుర్తుకు ఓటేసి తనను ఆశీర్వదించాలని బీఆర్ఎస్ పరిగి అభ్యర్థి కొప్పుల మహేశ్‌రెడ్డి కోరారు. మంగళవారం ఆయన పట్టణ కేంద్రంతోపాటుగా రుకుంపల్లి, నస్కల్, బర్కత్‌పల్లి గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి తిరిగి ఓటు అభ్యర్థించారు. చైర్మన్ ముకుందఅశోక్‌కుమార్, ఎంపీపీ అరవింద్‌రావు, జెడ్పీటీసీ సభ్యురాలు హరిప్రియ, పీఏసీఎస్ వైస్ చైర్మన్ భాస్కర్, మార్కెట్ కమిటీ చైర్మన్ సురేందర్, జెడ్పీ కోఆప్షన్ మాజీ సభ్యుడు మీర్‌మహ్మద్, నాయకులు ప్రవీణ్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు ఆంజనేయులు, కౌన్సిలర్లు కిరణ్, వెంకటేశ్, రవీందర్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

హామీలన్నీ నెరవేరుస్తాం

పూడూరు: పదేళ్లలో దేశమంతా తెలంగాణవైపు చూసేలా చేసిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కిందని బీఆర్ఎస్ పరిగి అభ్యర్థి మహేశ్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన మండల పరిధిలోని గొంగుపల్లిలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మహేశ్‌రెడ్డి మాట్లాడుతూ.. అధికారంలోకి వచ్చిన ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తామన్నారు. అనంతరం కుత్బుల్లాపూర్‌కు చెందిన వివిధ పార్టీల నాయకులు గులాబీ గూటికి చేరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మల్లేశం, నాయకులు కదీర్, ఆనందం, దయాకర్, గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తో పేదలకు న్యాయం



రామ్మోహన్‌రెడ్డి ఎన్నికల ప్రచారం

డీసీసీ అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి

పరిగి: కాంగ్రెస్‌తోనే పేదలకు న్యాయం చేకూరుతుందని డీసీసీ అధ్యక్షుడు, పార్టీ పరిగి అభ్యర్థి రామ్మోహన్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన మండల పరిధిలోని చిట్యాల, యాబాజిగూడ, లక్ష్మీదేవిపల్లి గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీకి అధికారం కట్టబెట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. కాంగ్రెస్ పార్టీ అమలు చేస్తున్న ఆరు గ్యారంటీలు ప్రజలకు నచ్చాయన్నారు. పార్టీ అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే గ్యారెంటీలను అమలు చేస్తామన్నారు. ప్రస్తుతం అందిస్తున్న ఆసరా పెన్షన్ మరింత పెంచుతామని అన్నారు. పెన్షన్‌ను ప్రారంభించేదే కాంగ్రెస్ ప్రభుత్వం అందన్నారు. ప్రలోభాలకు లొంగకుండా కాంగ్రెస్‌కు ఓటు వేసి గెలపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు పరశురాంరెడ్డి, పట్టణ అధ్యక్షుడు ఎర్రగడ్డపల్లి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

హస్తానికి అధికారమిస్తే ఉచిత ప్రయాణం

కాంగ్రెస్ తాండూరు అభ్యర్థి మనోహర్‌రెడ్డి



ఉచిత ప్రయాణం గురించి మహిళా ప్రయాణికురాలికి వివరిస్తున్న మనోహర్‌రెడ్డి

యాలాల: కాంగ్రెస్ పార్టీతోనే ప్రజా సంక్షేమం సాధ్యమని పార్టీ తాండూరు ఎమ్మెల్యే అభ్యర్థి బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. మంగళవారం ప్రచారంలో భాగంగా తాండూరు నుంచి లక్ష్మీనారాయణపూర్ వరకు ఆయన ఆర్టీసీ బస్సులో ప్రయాణించారు. ప్రయాణికులతో ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఆరు గ్యారెంటీ పథకాలలో ఒకటైన మహిళలకు బస్సులో ఉచిత ప్రయాణం ఉంటుందన్నారు. 200 యూనిట్ల లోపు ప్రతి ఇంటికి ఉచితంగా కరెంటు సరఫరా ఉంటుందన్నారు. రానున్న ఎమ్మెల్యే ఎన్నికల్లో చేతి గుర్తుకు ఓటేసి గెలిపించాలని కోరారు. ఆయన వెంట పెద్దేముల్ జెడ్పీటీసీ ధారాసింగ్ ఉన్నారు.

అభివృద్ధికి 'పైలట్' అవసరం



వృద్ధుడిని ఓటు అభ్యర్థిస్తున్న ఆర్తిరెడ్డి

రోహిత్‌రెడ్డి సతీమణి ఆర్తిరెడ్డి

యాలాల: తాండూరు నియోజకవర్గ అభివృద్ధికి బీఆర్ఎస్ అభ్యర్థి పైలట్ రోహిత్‌రెడ్డి అవసరమని ఆయన సతీమణి ఆర్తిరెడ్డి అన్నారు. మంగళవారం ఆమె కోకట్‌లో ఇంటింటి ప్రచారం చేపట్టారు. ఈ సందర్భగా ఆర్తిరెడ్డి మాట్లాడుతూ.. తాండూరుకు అధిక మొత్తంలో నిధులు తెచ్చిన ఘనత రోహిత్‌రెడ్డిదేనన్నారు. ప్రతీ పంచాయతీకి రూ.50లక్షల నిధులు కేటాయించారని గుర్తు చేశారు. మరోమారు ఆయన్ను భారీ మెజార్టీతో దీవించాలని కోరారు.

మైసమ్మ సాక్షిగా 'ఆరు గ్యారెంటీ'లు

మాజీమంత్రి గడ్డం ప్రసాద్‌కుమార్



మాట్లాడుతున్న మాజీమంత్రి గడ్డం ప్రసాద్‌కుమార్

ధారూరు: మీ గ్రామ దేవత మైసమ్మ సాక్షిగా చెబుతున్నా కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన వెంటనే గ్యారంటీ కార్డులో ఉన్న ఆరు సంక్షేమ కార్యక్రమాలను మీ ఇంటికి చేర్చే బాధ్యత నాదేనని మాజీమంత్రి గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. చివరి రోజుల ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన పార్టీ నాయకులతో కలిసి మంగళవారం మండల పరిధిలోని అల్లిపూర్, నాగారం, డీకేతండా తదితర గ్రామాల్లో మాట్లాడారు. ఉచిత విద్యుత్ పథకాన్ని ప్రవేశ పెట్టిన కాంగ్రెస్‌కే మద్దతివ్వాలని రైతులను కోరారు. నిరుద్యోగులకు మేలు జరగాలంటే హస్తానికి ఓటేయాలన్నారు. ఈ ప్రచారంలో యువజన కాంగ్రెస్ జాతీయ ప్రధాన కార్యదర్శి కోల్కొంద సంతోశ్ కుమార్, పీసీసీ ప్రధాన కార్యదర్శి రఘువీరారెడ్డి, వాలీబాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు హన్మంత్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు విజయభాస్కర్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యులు బసప్ప, శ్రీనివాస్, సర్పంచ్ కిరణ్‌కుమార్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు గంధం హన్మయ్య, మహ్మద్ బాబాఖాన్, రాములు, నాగార్జునరెడ్డి, మాన్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

ఆశీర్వదించండి.. అండగా ఉంటా



కాంగ్రెస్‌లో చేరుతున్న కృష్ణారెడ్డి తదితరులు

కాంగ్రెస్ చేవెళ్ల అభ్యర్థి భీంభరత్

మొయినాబాద్ రూరల్: నియోజకవర్గ ఓటర్లు తనను ఆదరించి హస్తం గుర్తుకు ఓటేసి ఆశీర్వదించాలని కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల అభ్యర్థి పామెన భీంభరత్ కోరారు. మంగళవారం బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, సర్దార్‌నగర్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ దారెడ్డి కృష్ణారెడ్డి పలువురు నాయకులతో కలిసి భీంభరత్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. యన వారికి పార్టీ కండువాకప్పి స్వాగతించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. తనను అసెంబ్లీకి పంపిస్తే ఆరు గ్యారెంటీల అమలు చేయిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో పీసీసీ సభ్యులు షాబాద్ దర్శన్, మండల అధ్యక్షుడు మాణయ్య, ఎంపీటీసీ మాజీ సభ్యుడు మాధవరెడ్డి, పీసీసీ ఫిషర్‌మెన్ సెల్ రాష్ట్ర అధ్యక్షులు తలారి భిక్షపతి ముదిరాజ్, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.